10-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 04-12-95 మధువనం

"యథార్థ నిశ్చయము యొక్క పునాది ద్వారా సంపూర్ణ పవిత్రతను ధారణ చెయ్యండి"

ఈ రోజు బాప్ దాదా దేశ-విదేశాలలో నలువైపులా ఉన్న కొత్త-కొత్త పిల్లలను చూస్తున్నారు. మధుబన్ కు సాకార రూపములో వచ్చినా లేక ఆకార రూపంలో తమ-తమ సేవా స్థానాలకు వచ్చి ఉన్నా, ఆ కొత్త-కొత్తవారిని చూసి బాప్ దాదా వారందరిలోని నిశ్చయాన్ని చూస్తున్నారు ఎందుకంటే నిశ్చయము ఈ బ్రాహ్మణ జీవితము యొక్క సంపన్నతకు పునాది మరియు పునాది దృఢంగా ఉన్నట్లయితే సహజంగా మరియు తీవ్రగతితో సంపూర్ణత వరకు చేరుకోవటము నిశ్చితము. నిశ్చయము కూడా రకరకాలుగా ఉండడాన్ని బాప్ దాదా చూస్తున్నారు. యథార్థ నిశ్చయము అనగా - నేను తండ్రి అయిన పరమాత్మకు చెందినవానిగా అయ్యాను, స్వయాన్ని కూడా ఆత్మ స్వరూపములో తెలుసుకోవటము, అంగీకరించటము, నడుచుకోవటము మరియు తండ్రిని కూడా వారు ఎవరో, అలానే తెలుసుకోవడము - ఇదే యథార్థ నిశ్చయము.

రెండవ నిశ్చయము - యోగం ద్వారా కొద్ది సమయము కొరకు అశాంతి నుండి శాంతిని అనుభవము చేస్తారు మరియు స్థానం యొక్క శక్తిశాలి శాంత వాయుమండలము ఆకర్షిస్తుంది లేదా బ్రాహ్మణ పరివారము, బ్రాహ్మణ ఆత్మల ఆత్మిక ప్రేమ మరియు పవిత్రతతో కూడిన జీవితము యొక్క ప్రభావము పడుతుంది, సాంగత్యము మంచిగా అనిపిస్తుంది, ప్రపంచములోని వాయుమండలముతో పోలిస్తే ఈ సాంగత్యము మంచిగా అనిపిస్తుంది, జ్ఞానము కూడా మంచిగా అనిపిస్తుంది, పరివారము కూడా మంచిగా అనిపిస్తుంది, వాయుమండలము కూడా మంచిగా అనిపిస్తుంది... కావున ఈ విధంగా మంచిగా అనిపించటము అనే పునాది ఆధారముగా నడుస్తుంటారు. ఇది రెండవ నంబరు. మొదటి నంబరు వినిపించాము 'యథార్థ నిశ్చయము' మరియు రెండవ నంబరు 'మంచిగా అనిపించటము' మరియు మూడవ నంబరు - ప్రాపంచిక సంబంధీకుల దుఃఖమయ వాతావరణము నుండి తప్పించుకుని ఎంత సమయమైతే సేవా కేంద్రానికి వస్తారో అంత సమయము దుఃఖము నుండి దూరమై శాంతిని అనుభవము చేస్తారు. జ్ఞానం యొక్క గుహ్యతలోకి వెళ్ళరు కానీ శాంతి యొక్క ప్రాప్తి కారణంగా ఒక్కోసారి వస్తారు మరియు ఒక్కోసారి రారు కూడా. కానీ యథార్థమైన నిశ్చయబుద్ధి కలవారు విజయీగా ఉంటారు. ఇది కూడా గమనించడం జరిగింది - మొట్టమొదట్లో వచ్చినప్పుడు అశాంతితో విసిగిపోయి ఉంటారు, శాంతి కావాలన్న కోరికతో ఉంటారు. ఏ విధంగానైతే దాహంతో ఉన్నవారికి ఒక్క నీటి చుక్క లభించినా కానీ దానిని వారు చాలా గొప్పగా అనుభవం చేస్తారు. కావున ఇది అప్రాప్తి నుండి ప్రాప్తి కలిగినట్లు. పరివారంలో, జ్ఞానంలో, యోగంలో, వాయుమండలంలో తేడా కనిపిస్తుంది. కావున మొదట్లో చాలా ఉల్లాస-ఉత్సాహాలతో నడుస్తారు, చాలా నషా ఉంటుంది, సంతోషం కూడా ఉంటుంది. కానీ ఒకవేళ మొదటి నంబరు నిశ్చయమైన 'యథార్థ నిశ్చయము' యొక్క పునాది దృఢంగా లేనట్లయితే, రెండవ నంబరు లేక మూడవ నంబరు నిశ్చయము ఉన్నట్లయితే నెమ్మది-నెమ్మదిగా మొదట్లో ఉన్న సంతోషము, మొదట్లో ఉన్న ఉత్సాహము, వీటిలో తేడా వచ్చేస్తుంది.

ఈ సీజన్ లో కొత్త-కొత్తవారు చాలామంది వచ్చారు మరియు అవకాశము కూడా లభించింది, ఇదైతే చాలా మంచిది. వీరు మళ్ళీ తమ పరివారములోకి చేరుకున్నారు అని బాప్ దాదాకు కూడా కొత్త-కొత్త పిల్లలను చూసి సంతోషం కలుగుతుంది. కానీ చెక్ చేసుకోండి - నిశ్చయము అనే పునాది దృఢంగా ఉందా, మా నిశ్చయము నంబరు వన్ లో ఉందా లేక నంబరు టూ లో ఉందా? ఒకవేళ నంబరు వన్ నిశ్చయము ఉన్నట్లయితే నడుస్తూ-నడుస్తూ ముఖ్యమైన పవిత్రతను ధారణ చెయ్యటం కష్టమనిపించదు. ఒకవేళ పవిత్రత అనేది స్వప్నమాత్రంగా కదిలించినా, అలజడిలోకి వచ్చినా, నంబరు వన్ పునాది బలహీనంగా ఉందని అర్థం చేసుకోండి ఎందుకంటే ఆత్మ స్వధర్మము పవిత్రత. అపవిత్రత పరధర్మము మరియు పవిత్రత స్వధర్మము. కావున ఎప్పుడైతే స్వధర్మము యొక్క నిశ్చయము ఉంటుందో అప్పుడు పరధర్మము కదిలించలేదు. చాలా మంది పిల్లలు, మొదట్లో చాలా మంచిగా వచ్చేవాళ్ళము, ఇప్పుడు ఏమైందో తెలియదు? అని అంటారు. ఏమవుతుందంటే - తండ్రి ఎవరో, ఏ విధంగా ఉంటారో, ఆ విధంగా అనుభవంలోకి తీసుకురారు. ఒకవేళ తండ్రి తోడుగా ఉన్నారా అని అడిగితే అందరూ చేతులు ఎత్తుతారు. చేతులు ఎత్తడం చాలా సహజము కానీ తండ్రి తోడుగా ఉన్నట్లయితే, వారు సర్వశక్తివంతుడు అంటూ తండ్రి యొక్క మొట్టమొదటి మహిమను

ఏదైతే చేస్తారో, దానిని కేవలము అంగీకరిస్తారా లేక తెలుసుకుంటారా? మరి సర్వశక్తివంతుడైన తండ్రి తోడుగా ఉన్నట్లయితే సర్వశక్తివంతుని ఎదురుగా అపవిత్రత రాగలదా? రాలేదు. కానీ రావడమైతే వస్తుంది కదా! మరి ఎక్కడి నుండి వస్తున్నట్లు? వేరే స్థానం ఏదైనా ఉందా? దొంగలు తమకంటూ ప్రత్యేకమైన ద్వారాన్ని తయారుచేసుకుంటారు. దొంగ దారి ఉంటుంది. మరి మీ వద్ద కూడా దాగి ఉన్న దొంగ దారి అయితే ఏమీ లేదు కదా? చెక్ చేసుకోండి. లేదంటే మాయ ఎక్కడి నుండి వచ్చింది? పై నుండి వచ్చిందా? ఒకవేళ పై నుండి వచ్చినా కానీ, పైనే అంతమైపోవాలి. మీకు తెలియకుండా ఏదైనా దాగి ఉన్న ద్వారం నుండి వస్తుందంటే చెక్ చేసుకోండి - మాయ ఏదైనా దొంగ దారిని తయారుచేసుకునైతే పెట్టుకోలేదు కదా? మరియు ఆ ద్వారాన్ని కూడా ఎలా తయారుచేసుకుంటుందో తెలుసా? మీలో విశేషంగా ఏదైనా స్వభావం లేక సంస్కారం బలహీనంగా ఉంటుంది కదా, దానినే మాయ తన ద్వారంగా చేసుకుంటుంది ఎందుకంటే ఎప్పుడైనా ఏదైనా స్వభావము లేక సంస్కారము బలహీనంగా ఉంటే, మీరు ఆ ద్వారాన్ని ఎంతగా మూసినా కానీ అది బలహీనమైన ద్వారం, మాయ అయితే అన్నీ తెలిసినది, ఈ ద్వారం బలహీనంగా ఉంది, దీని ద్వారా దారి లభించవచ్చు అని దానికి తెలిసిపోతుంది మరియు ఆ విధంగా దారి లభిస్తుంది కూడా. నడుస్తూ-నడుస్తూ ఉండగా అపవిత్రతతో కూడిన సంకల్పాలు కూడా వస్తాయి, మాటలు కూడా వస్తాయి, కర్మ కూడా జరిగిపోతుంది. మరి ద్వారం తెరిచే ఉన్నట్లు కదా, అందుకే కదా మాయ వచ్చింది. అటువంటప్పుడు తండ్రి తోడుగా ఉన్నట్లు ఎలా అవుతుంది? అనటానికైతే సర్వశక్తివంతుడు తోడుగా ఉన్నారు అని అంటారు, మరి ఈ బలహీనత ఎక్కడి నుండి వచ్చింది? బలహీనత ఉండగలదా? ఉండలేదు కదా? మరి ఎందుకు ఉండిపోతుంది? పవిత్రతలో ఏదైనా వికారము ఉన్నట్లయితే, లోభమే ఉందనుకోండి, లోభమంటే కేవలము తినటము-త్రాగటము విషయములోనే కాదు, చాలా మంది ఏమనుకుంటారంటే - మాకు ధరించటంలో, తినటంలో లేక ఉండటంలో ఆకర్షణ అయితే ఏమీ లేదు, ఏది లభించినా, ఏది తయారుచేసినా దాని అనుసారంగానే నడుచుకుంటాము. కానీ ముందుకు వెళ్ళే కొలది మాయ లోభాన్ని కూడా రాయల్ రూపంలో మరియు సూక్ష్మ రూపంలో తీసుకొస్తుంది. ఆ రాయల్ లోభం ఏమిటి? స్టూడెంట్ అయినా లేక టీచర్ అయినా కానీ, మాయ అనేది ఇరువురిలోనూ రాయల్ లోభాన్ని తీసుకువచ్చేందుకు పూర్తి పురుషార్థం చేస్తుంది. ఒక స్టూడెంట్ ఉన్నారనుకోండి, చాలా మంచి నిశ్చయబుద్ధి కలవారు, సేవాధారి, అన్నింటిలో మంచిగా ఉంటారు కానీ ముందుకు వెళ్ళే కొలది రాయల్ లోభము ఎలా వస్తుందంటే - నేను ఇంత చేస్తాను, అన్ని రకాలుగా సహాయకునిగా ఉంటాను, తనువుతో, మనసుతో, ధనంతో ఏ సమయంలో కావాలంటే ఆ సమయంలో సేవలో హాజరవుతాను, అయినా కానీ ఈ జిజ్ఞాసువు చాలా మంచివారు అని నా పేరును టీచరు ఎప్పుడూ వర్ణన చేయరు. ఒకవేళ ఈ రూపంలో కూడా రాకపోతే మాయ వచ్చే మరో రూపం ఏమిటి? అచ్చా, పేరు తీసుకున్నారనే అనుకోండి, ఆ పేరు వింటూ-వింటూ - అది నేనే, నేనే చేస్తాను, నేనే చెయ్యగలను, అది అభిమానం రూపంలో వస్తుంది. లేదంటే చాలా పని చేసి వచ్చారు కానీ ఎవ్వరూ మిమ్మల్ని కనీసం అడగలేదు కూడా, ఒక గ్లాసు నీళ్ళు కూడా ఇవ్వలేదు, అసలు చూడనే లేదు, తమ విశ్రాంతిలోనే లేక తమ పనిలోనే బిజీగా ఉన్నారు, అప్పుడు ఇలా కూడా వస్తుంది - ఎంత చేసినా కానీ ఎవ్వరూ అడగరు, ఇంకెందుకు చేయాలి, చేసినా ఒకటే చెయ్యకపోయినా ఒకటే, అడిగేవారు ఎవరూ లేరు, దీని కన్నా ప్రశాంతంగా ఇంట్లో కూర్చోవచ్చు, కుదిరినప్పుడు సేవ చేస్తాను. వికారాల యొక్క రాయల్ రూపము ఇలా రకరకాలుగా వస్తుంది మరియు ఒక్క వికారము వచ్చినా కూడా, ఒకవేళ లోభం రాకపోయినా కానీ అభిమానం వచ్చినా లేక నన్ను గౌరవించాలి, నాకు విలువ ఉండాలి అనే భానం వచ్చినా, ఇలా ఎక్కడైతే ఒక్క వికారం ఉంటుందో అక్కడ దాని నలుగురు సహచరులు దాగి ఉంటాయి. మరియు మీరు ఒక్కదానికి అవకాశమిచ్చినా దాగి ఉన్న మిగిలినవి కూడా సమయం అనుసారంగా తమ అవకాశాన్ని తీసుకుంటుంటాయి. అప్పుడు ఏమంటారంటే, ముందు ఉన్నలాంటి నషా ఇప్పుడు లేదు, ముందు చాలా మంచిగా ఉండేది, మొదట్లో అవస్థ చాలా బాగుండేది, ఇప్పుడు ఏమైందో తెలియదు. మాయ దొంగ దారి నుండి వచ్చింది - ఇది విషయం, తెలియదు అని అనకండి.

టీచర్లకు కూడా వస్తుంది. టీచర్లకు ఏం కావాలి? సెంటర్ మంచిగా ఉండాలి, బట్టలు ఎలా ఉన్నా కానీ సెంటరు అయితే కాస్త ఉండేందుకు యోగ్యంగా ఉంటే మంచిగా ఉంటుంది. మరియు ఎవరైతే తోడుగా ఉంటారో వారు మంచిగా ఉండాలి, విద్యార్థులు మంచిగా ఉండాలి, బాబా భండారీ మంచిగా ఉండాలి. ఒకవేళ మంచి విద్యార్థి వేరే చోటుకు వెళ్ళిపోతే గుండె కాస్త వేగంగా కొట్టుకుంటుంది. అప్పుడెలా అనుకుంటారంటే - ఏం చెయ్యాలి, వీరు సహాయకులుగా ఉండేవారు కదా, ఇప్పుడు వీరు వెళ్ళిపోయారు. సహాయకుడు జిజ్ఞాసువా లేక తండ్రినా? మరి ఆ సమయంలో ఎవరు కనిపిస్తారు? జిజ్ఞాసువా లేక తండ్రినా? ఈ రాయల్ మాయ పునాదిని కదిలించేందుకు ప్రయత్నం చేస్తుంది. ఒకవేళ మీకు - సర్వశక్తివంతుడు తోడుగా ఉన్నారు అన్న నిశ్చయము ఉన్నట్లయితే తండ్రి ఎవరో ఒకరిని తప్పకుండా నిమిత్తం చేస్తారు. కొందరు ఎలా ఆలోచిస్తారంటే - మాకు కనీసం ఒక్కసారైనా అబూలో జరిగే కాన్ఫరెన్స్ లో లేక మరేదైనా పెద్ద

కాన్ఫరెన్స్ లో అవకాశం లభించాలి, పోనీ వేరే ఏదీ కాకపోయినా కనీసం యోగ శిబిరం అయితే చేయించాలి, కనీసం ఈ అవకాశమైనా ఉండాలి కదా, పోనీ భాషణ చేయకపోయినా కనీసం స్టేజ్ పైకైతే రావాలి, చివరికి వినాశనం అయ్యేటట్లు ఉంది, వినాశనం వరకు కూడా మాకు అవకాశం రాదా ఏమిటి, అవకాశమైతే రావాలి కదా! కానీ ఇంతకుముందు కూడా బాప్ దాదా వినిపించారు - ఒకవేళ యోగ్యులుగా ఉన్నారు, అవకాశం లభించింది అంటే సంతోషంగా చేయండి కానీ మాకు అవకాశం లభించాలి అని ఈ సంకల్పము చెయ్యటము... ఇది కూడా అడగటమే. కావాలి-కావాలి - ఇది రాయల్ రూపంలో అడగటము. ఇలా జరగాలి... వీరు మమ్మల్ని గుర్తించటం లేదు, దాదీ-దీదీలు కూడా అందరినీ గుర్తించటం లేదు, ఎవరు ముందు వస్తే వారిని ముందు పెట్టేస్తారు - ఇటువంటి సంకల్పం రావటం, ఇది కూడా సూక్ష్మంగా అడగటము. కానీ బాప్ దాదా వినిపించారు కదా, మీరు స్టేజ్ పైకి వచ్చారే అనుకోండి లేదా మీలో ఉన్న ఏదో ఒక విశేషత కారణంగా, మీకు యోగం లేకపోయినా కానీ, మీ అవస్థ అంత మంచిగా లేకపోయినా కానీ, ఒకవేళ మాటల్లో, క్యాచింగ్ పవర్ లో విశేషత ఉన్నట్లయితే అవకాశం లభించేస్తుంది, ఎందుకంటే కొందరి వాణిలో మాధుర్యం ఉంటుంది, స్పష్టత ఉంటుంది మరియు వారిలో క్యాచింగ్ పవర్ ఉంటుంది, అప్పుడు వారు అక్కడి నుండి ఇక్కడి నుండి ఉదాహరణలు వగైరా సేకరించి వినిపిస్తారు, అందుకే వారికి పేరు కూడా వస్తుంది. ఎవరు కావాలి అంటే ఫలానావారు కావాలి అంటారు. ఎవరు రావాలి అంటే ఫలానావారు రావాలి అంటారు. వారు యోగంలో బలహీనంగా ఉండవచ్చు... కానీ వీటన్నింటి ఆధారంగా నంబరు ఫైనల్ అవ్వదు. వీరు ఎన్ని భాషణలు చేసారు లేక ఎంతమంది విద్యార్థులను తయారుచేసారు లేక ఎన్ని సెంటర్లను తయారుచేసారు అన్నదానిపై ఫైనల్ నంబరు ఆధారపడదు. కానీ యోగ్యులుగా ఎంతమందిని తయారుచేసారు? సెంటర్ తయారుచెయ్యటం పెద్ద విషయం కాదు కానీ యోగ్యులుగా ఎంతమంది ఆత్మలను చేసారు? 30 సెంటర్లకు ఇన్ఛార్జ్ అన్న పేరైతే వచ్చింది మరియు ఆ 30 లో 15 కదులుతున్నాయి, 15 బాగానే ఉన్నాయి, అప్పుడు అందులో లాభముందా లేక కేవలం పేరు మాత్రమే వచ్చిందా? ఫలానావారికి 30 సేవా కేంద్రాలు ఉన్నాయి అన్న పేరైతే వస్తుంది, కానీ నంబరు అనేది దీని ఆధారంగా లభించదు. ఎంతమందికి సుఖమిచ్చారు, ఎంతగా స్వయం శక్తిశాలిగా ఉన్నారు అన్నదాని ఆధారంగానే ఫైనల్ నంబరు లభిస్తుంది. అందుకే ఈ రకమైన కావాలి-కావాలి అన్నది కూడా సమాప్తం చేయండి లేదంటే యోగం కుదరదు. రోజు ఇదే చూసుకుంటూ ఉంటారు - ఫలానా చోట ప్రోగ్రామ్ జరిగింది, అయినా నన్ను పిలవలేదు, మొన్న ఇక్కడ జరిగింది, నిన్న అక్కడ జరిగింది, ఈ రోజు ఇక్కడ జరిగింది! ఇలా ఉంటే యోగం కుదురుతుందా లేక లెక్కపెట్టుకుంటూ ఉంటారా?

కనుక ముఖ్యమైన విషయం ఏమిటంటే యథార్థ నిశ్చయాన్ని దృఢం చేసుకోండి. నేను ఆత్మను మరియు తండ్రి సర్వశక్తివంతుడు అని అనటానికైతే అంటారు కానీ అది ప్రాక్టికల్ గా కర్మలలోకి రావాలి. తండ్రి సర్వశక్తివంతుడే కానీ మాయ నన్ను కదిలిస్తూ ఉంటే మీ తండ్రి సర్వశక్తివంతుడు అని ఎవరు ఒప్పుకుంటారు! ఎందుకంటే వారి కన్నా గొప్పవారైతే ఇంకెవ్వరూ లేరు. కనుక బాప్ దాదా ఈ రోజు నిశ్చయము యొక్క పునాదిని చూస్తున్నారు. కొత్తవారైనా లేక పాతవారైనా కానీ ఈ నిశ్చయము యొక్క పునాదిని ప్రాక్టికల్ లోకి తీసుకురండి మరియు సమయానికి ఉపయోగించండి. సమయం గడిచిపోతుంది, అప్పుడు తండ్రి ముందుకు పశ్చాత్తాపంతో వస్తారు - ఏం చెయ్యాలి, బాబా జరిగిపోయింది, మీరైతే దయార్ద్ర హృదయులు, దయ చూపించండి... ఇదేమైనట్లు? ఇది కూడా రాయల్ పశ్చాత్తాపము. వారు తోడుగా ఉన్నారంటే ఎవ్వరికీ ధైర్యముండదు. నిశ్చయబుద్ధి అంటేనే విజయీ అని అర్థము. ఒకవేళ ఏదైనా లెక్కాచారము వచ్చినా మనసును కదలనివ్వకండి. స్థితిని కింద-మీద చేసుకోకండి. సరే, వచ్చింది, వెంటనే దానిని దూరం నుండే సమాప్తము చేయండి. ఇప్పుడు యోధులుగా అవ్వకండి. ఎంతోమంది ఇప్పుడు నిరంతర యోగులుగా లేరు. కొద్ది సమయము యోగులుగా ఉంటారు మరియు కొద్ది సమయము యుద్ధం చేసే యోధులుగా ఉంటారు. కానీ మిమ్మల్ని మీరు ఏమని పిలుచుకుంటారు? యోధులనా లేక యోగులనా? సహజయోగి అని చెప్పుకుంటారు. కొత్తవారెవరైతే వచ్చారో, భాగ్యాన్ని ప్రాప్తి చేసుకున్నందుకు వారికి బాప్ దాదా మళ్ళీ అభినందనలను తెలుపుతున్నారు. కానీ అభినందనలతోపాటు పునాది నంబరు వన్ గా ఉందా లేక నంబరు టూ గా ఉందా అన్నదానిని చెక్ చేసుకోండి?

జ్ఞానము, యోగము చాలా మంచిగా అనిపిస్తాయని చాలామంది అంటారు, మంచిది, అది బాగానే ఉంది కానీ వాటిని కర్మలలోకి తీసుకొస్తున్నారా? జ్ఞానము అంటే ఆత్మ, పరమాత్మ, డ్రామా... అని కేవలం ఇలా అనటమే కాదు. జ్ఞానము అనగా వివేకము అని అర్థము. వివేకవంతులు ఎటువంటి సమయమో ఆ సమయమనుసారంగా వివేకాన్ని ఉపయోగించి సదా సఫలతను పొందుతారు. ఎప్పుడైనా చూడండి, జీవితంలో దుఃఖం వస్తే ఏమి ఆలోచిస్తారు? ఇది నాకు ఎందుకు అర్థమవ్వలేదో తెలియడం లేదు అని అంటారు. మరి మీరు వివేకవంతులేనా? జ్ఞానులేనా? అవునా,

కాదా చెప్పండి. (హాజీ). అవును అని చాలా బాగా చెప్తారు. వివేకవంతుల గుర్తు, ఎప్పుడూ మోసపోకుండా ఉండటము - ఇది జ్ఞానీల గుర్తు. మరియు యోగీల గుర్తు - సదా స్వచ్ఛమైన మరియు స్పష్టమైన బుద్ధి. స్వచ్ఛంగా కూడా ఉండాలి మరియు స్పష్టంగా కూడా ఉండాలి. యోగీ ఎప్పుడూ - తెలియదు, తెలియదు అని అనరు. వారి బుద్ధి సదా స్పష్టంగా ఉంటుంది. మరియు ధారణా స్వరూపులకు గుర్తు - సదా స్వయం కూడా డబుల్ లైట్ గా ఉంటారు. ఎన్ని బాధ్యతలు ఉన్నా కానీ ధారణామూర్తులుగా ఉంటారు, సదా డబుల్ లైట్ గా ఉంటారు. మేళా ఉన్నా లేక గందరగోళం ఉన్నా - రెండింటిలో డబుల్ లైట్ గా ఉంటారు. మరియు సేవాధారికి గుర్తు - సదా నిమిత్తము మరియు నిర్మాన భావము. కనుక వీటన్నింటినీ మీలో చెక్ చేసుకోండి. నాలుగు సబ్జెక్టులు కల ఈశ్వరీయ విద్యార్థులము అని అనటమైతే అందరూ అంటారు కదా. మరి ఆ గుర్తులు కనిపించాలి.

మరి కొత్త-కొత్తవారు ఏం చేస్తారు? మీ నిశ్చయాన్ని ఇంకా దృఢం చేసుకోండి. లేకపోతే ఏమవుతుందంటే రెండు సంవత్సరాలు నడుస్తారు, మూడు సంవత్సరాలు నడుస్తారు, మళ్ళీ తిరిగి పాత ప్రపంచంలోకి వెళ్ళిపోతారు. మరియు ఎవరైతే తిరిగి వెళ్తారో వారు ఆ ప్రపంచంలో కూడా సెట్ అవ్వలేరు. ఈ ప్రపంచానికీ చెంది ఉండరు, ఆ ప్రపంచానికీ చెంది ఉండరు. అందుకే మీ పునాదిని చాలా దృఢంగా చేసుకోండి. సర్వశక్తివంతుడైన తండ్రి తోడు ఉన్నారు అని అనుభవము చెయ్యండి. కేవలం ఈ ఒక్క విషయాన్ని అనుభవం చేసినా సరే అన్నింటిలో పాస్ అయిపోతారు. చూడండి, ఈ రోజుల్లో ఎవరైనా ప్రధానమంత్రి లేక మంత్రి వంటివారు తోడుగా ఉన్నా నషా ఉంటుంది కదా, మరి వీరైతే సర్వశక్తివంతుడు! అచ్ఛా!

అచ్ఛా, నలువైపులా ఉన్న సదా శ్రేష్ఠ భాగ్యవంతులకు, భాగ్యవిధాతను తమవారిగా చేసుకునే ఇటువంటి శ్రేష్ఠ ఆత్మలకు, సదా బాప్ దాదా యొక్క శ్రీమతాన్ని వినే మరియు ఆచరించే సుపుత్రులైన పిల్లలందరికీ, సదా సేవలో అచలంగా ఉంటూ, గందరగోళం నుండి ముక్తులుగా ఉంటూ, పరమాత్మ మిలన మేళాను జరుపుకునే పిల్లలందరికీ బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

అచ్ఛా - డబుల్ విదేశీయులకు డబుల్ నషా ఉంది కదా? డబుల్ విదేశీ అనగా డబుల్ లైట్, డబుల్ నషా మరియు బాప్ దాదాకు మరియు పరివారానికి డబుల్ ప్రియమైనవారు. అర్థమైందా?

వరదానము:- నా వారు అన్న అధికారము యొక్క అనుభూతి ద్వారా ఆధీనతను సమాప్తము చేసే సర్వ అధికారి భవ
తండ్రిని తమవారిగా చేసుకోవటము అనగా తమ అధికారము అనుభవమవ్వటము. ఎక్కడైతే అధికారము ఉంటుందో అక్కడ స్వయము పట్ల కూడా ఆధీనత ఉండదు, సంబంధ-సంపర్కములోకి వచ్చే ఆధీనత కూడా ఉండదు, అలాగే ప్రకృతి మరియు పరిస్థితులలోకి వచ్చే ఆధీనత కూడా ఉండదు. ఎప్పుడైతే ఈ అన్ని రకాల ఆధీనతలు సమాప్తమవుతాయో అప్పుడు సర్వ అధికారిగా అవుతారు. ఎవరైతే తండ్రిని తెలుసుకున్నారో మరియు తెలుసుకుని తమవారిగా చేసుకున్నారో, వారే మహానులు మరియు అధికారులు.

స్లోగన్:- తమ సంస్కారాలను మరియు గుణాలను సర్వులతో కలుపుకొని వెళ్ళడము - ఇదే విశేష ఆత్మల విశేషత.